
సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
ఆదివారం । 27 । ఆగస్టు । 2023



టన్ను చీనీ రూ.16,500
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనివారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.16,500, కనిష్టం రూ.5 వేలు, సరాసరిన రూ.11 వేల ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



కిలో టమాట రూ.20
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్టంగా రూ.20 ప్రకారం ధర పలికింది. మార్కెట్‌కు 4,500 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.

గరిష్టం/కనిష్టం
37.2°/21.5°
జిల్లా అంతటా శనివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 12 కి.మీ వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

ఖాద్రీశుని సేవలో జస్టిస్ లక్ష్మణరెడ్డి



జస్టిస్ లక్ష్మణరెడ్డి దంపతులకు శ్రీవారి చిత్రపటాన్ని అందజేస్తున్న అర్చకులు

కదిరి టౌన్: లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి శనివారం ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో గడిపారు. సతీసమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు అర్చకులు, సిబ్బంది జస్టిస్ లక్ష్మణరెడ్డి దంపతులకు పూర్ణ కుంభంతో స్వాగతం పలికి ఆలయ విశిష్టతను వివరించారు. పూజల అనంతరం దుశ్శాలువ, పూలమాలలతో సన్మానించారు. తీర్థప్రసాదాలు అందజేసి, జ్ఞాపకార్థంగా శ్రీవారి చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గోపాలకృష్ణ, ఈఓ వి.శ్రీనివాసరెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు ఏవీ నరసింహాచార్యులు, ఏడీ పార్థసారథి, కుమార్‌స్వామి, అంజన్‌కుమార్‌స్వామి, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

పెళ్లి మండపం నుంచి పరీక్ష హాలుకు..



పరీక్ష రాస్తున్న నవ వధువు భార్గవి

కదిరి అర్బన్: భవితను మార్చే ఆయుధం చదువు ఒక్కటేనని తెలుసుకున్న ఓ యువతి పెళ్లయిన గంటల వ్యవధిలోనే పరీక్షహాలులో ప్రత్యక్షమై అందరినీ ఆశ్చర్య పరిచింది. వివరాల్లోకి వెళితే... నల్లమాడ మండలం కురుమాలకు చెందిన రామాంజనేయులు, రమాదేవి దంపతుల కుమార్తె భార్గవి స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎమ్మెస్సీ జువాలజీ చదువుతోంది. ఆమెకు కురుమాలకు చెందిన వేణుగోపాల్‌తో పెళ్లి నిశ్చయమైంది. ముహూర్తం బాగుందంటూ తల్లిదండ్రులు 26వ తేదీ (శనివారం) తెల్లవారుజామున పెళ్లి చేయాలని నిర్ణయించారు. అయితే శనివారమే భార్గవికి సెకండ్ సెమిస్టర్ పరీక్ష ఉంది. దీంతో భార్గవి... తల్లిదండ్రులు నిర్ణయించిన ముహూర్తానికే మెడలో మూడుముళ్లు వేయించుకుంది. ఆ వెంటనే వెళ్లి పరీక్ష రాసింది. పరీక్షహాలులో కనిపించిన భార్గవిని చూసి స్నేహితులు, అధ్యాపకులు ఆశ్చర్యపోయారు. చదువుపట్ల ఆమెకున్న మక్కువను చూసి ముచ్చటపడ్డారు.

'ఉత్తమ' అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రశాంతి నిలయం: జిల్లాస్థాయి 'ఉత్తమ ఉపాధ్యాయ-2023'అవార్డుల కోసం జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్యాల కింద పని చేస్తున్న ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ మీనాక్షి సూచించారు. కనీసం పదేళ్ల అనుభవం ఉన్న ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు మండల కమిటీకి, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు ఉప విద్యాశాఖ అధికారి స్థాయి కమిటీకి ఈనెల 28వ తేదీలోపు దరఖాస్తులు అందించాలన్నారు. సంబంధిత అధికారులు దరఖాస్తులను పరిశీలించి కమిటీ సభ్యులు సంతకాలతో ఈనెల 29వ తేదీలోపు డీఈఓ కార్యాలయానికి పంపాలని సూచించారు.

రైతు ప్రయోజనాలే ధ్యేయం

- ప్రత్యామ్నాయ పంటలపై రైతుల్లో చైతన్యం తేవాలి
- వ్యవసాయ శాఖ అధికారులకు మంత్రి ఉషశ్రీచరణ్ ఆదేశం



జెడ్పీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్, చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, కలెక్టర్ గౌతమి, సీఈఓ కేతన్‌గార్గ్ తదితరులు

అనంతపురం సిటీ: రైతుల విస్తృత ప్రయోజనాలే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ పునరుద్ఘాటించారు. ఉమ్మడి జిల్లాలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో అదను దాటినందున ప్రధాన పంటల స్థానంలో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా రైతుల్లో చైతన్యం తేవాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం అనంతపురంజెడ్పీ కార్యాలయ సమావేశ భవన్‌లో చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, అనంతపురం కలెక్టర్ గౌతమి, జెడ్పీ సీఈఓ/జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, శ్రీసత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ చేతన్, ట్రైనీ కలెక్టర్ కుషాల్ జైన్, డిప్యూటీ సీఈఓ లలితాబాయి హాజరయ్యారు. వైద్య ఆరోగ్య, డీఆర్‌డీఏ, హౌసింగ్ శాఖలపై చర్చ నిర్వహించారు. ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పని తీరుపై సభ్యులు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ తమ శాఖ ప్రగతి నివేదికను చదివి వినిపిస్తుండగా.. సభ్యులు అభ్యంతరం తెలిపారు. అదను దాటిపోయినా పదును కాకపోవడంతో చాలా మంది రైతులు ప్రధాన పంట వేరుశనగ సాగు చేయలేకపోయారని సభ్యులు తెలిపారు. ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి జోక్యం చేసుకుంటూ జూన్, జూలై నెలల్లో ఏయే పంటలు సాగు చేశారు? వాటి పరిస్థితి ఏమిటో వివరించాలని కోరారు. కూడేరు జెడ్పీటీసీ సభ్యురాలు బీఎస్ అశ్విని తమ నియోజకవర్గంలో వర్షాభావ పరిస్థితులతో పాటు విద్యుత్ కోతల గురించి సభలో ప్రస్తావించారు. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా రైతుల్లో చైతన్యం తీసుకురావాలని గుమ్మఘట్ట జెడ్పీటీసీ సభ్యుడు మహేశ్ కోరారు. జేసీ కేతన్ గార్గ్ స్పందిస్తూ రాగి, జొన్న, కొర్రలు సాగు చేసే రైతులకు 90 శాతం సబ్సిడీతో విత్తనాలు అందిస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టీడీపీ హయాంలో పంపిణీ చేసిన రెయిన్‌గన్లు, స్ప్రింక్లర్లు బడా రైతులు, ఆ పార్టీ నేతల ఇళ్లల్లో ఉండిపోయాయని, వాటిని రికవరీ చేసి చిన్న, సన్న కారు రైతులకు పంపిణీ చేయాలని బెళుగుప్ప ఎంపీపీ పెద్దన్న డిమాండ్ చేశారు.

సమస్యలు పరిష్కరించాలి

సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలను సత్వరం పరిష్కరించాల్సిన బాధ్యత అధికారుల దేనని మంత్రి ఉషశ్రీచరణ్ ఆదేశించారు. 'నాడు-నేడు' కింద అంగన్‌వాడీ కేంద్రాల మరమ్మతులు చేపడుతున్నామని, మరో దశలో ప్రహరీలు నిర్మిస్తామని తెలిపారు. అంగన్‌వాడీల్లో మరుగుదొడ్లు ఎక్కడైతే లేవో పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆర్ఓల ప్లాంట్ల ఏర్పాటుకు సీడీపీఓల ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలన్నారు.

ఉమ్మడి జిల్లా అభివృద్ధికి కృషి

ఉమ్మడి జిల్లా అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ అన్నారు. 15వ ఫైనాన్స్ కింద రూ.20 కోట్లతో తాగునీరు, డ్రెయినేజీ, రహదారులు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. చాలా ప్రాంతాల ఆస్పత్రుల్లో వైద్యుల పనితీరు, 108 అంబులెన్స్ సేవలపై ఫిర్యాదులు వస్తున్నాయని, వీటిపై క్షేత్రస్థాయిలో పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ప్రజా ప్రతినిధులు కూడా ఇళ్ల నిర్మాణాలు పూర్తికి లబ్ధిదారులతో మాట్లాడాలన్నారు.

ప్రైవేటు ఆస్పత్రుల్లో దోపిడీపై మండిపాటు..
కార్పొరేట్, ప్రైవేటు ఆస్పత్రుల తీరుపై సభ్యులు మండిపడ్డారు. అనంతపురంలో ప్రైవేటు, కార్పొరేట్ వైద్యశాలల్లో రోగులను నిలువు దోపిడీ చేస్తున్నారని ఆత్మకూరు ఎంపీపీ హేమలత ధ్వజమెత్తారు. అంబులెన్సుల్లో ఆక్సిజన్ సౌకర్యం ఉండేలా చూడాలని అనంతపురం రూరల్ జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్ డిమాండ్ చేశారు. నార్పల పీహెచ్‌సీలో స్కానింగ్ మిషన్‌ను వినియోగంలోకి తేవాలని జెడ్పీటీసీ సభ్యురాలు నాగరత్నమ్మ అడిగారు. లేపాక్షి పీహెచ్‌సీలో గైనకాలజిస్ట్‌ను అందుబాటులో ఉంచాలని జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి కోరారు. ఓడీచెరువు పీహెచ్‌సీ భవనం శిథిలావస్థకు చేరిందని జెడ్పీటీసీ సభ్యుడు కుర్లి దామోదర్ రెడ్డి అధికారుల దృష్టికి తెచ్చారు. రొద్దంలో పీహెచ్‌సీ భవన నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని ఎంపీపీ చంద్రశేఖర్ కోరారు.

యానిమేటర్ల తీరుపై గరంగరం..
డ్వాక్రా సంఘాల్లో కీలకపాత్ర పోషిస్తున్న యానిమేటర్లు లక్షలాది రూపాయలు పక్కదారి పట్టిస్తూ, మహిళలను మోసం చేస్తున్నారని బుక్కరాయసముద్రం, యల్లనూరు, లేపాక్షి, గుడిబండ జెడ్పీటీసీ సభ్యులు భాస్కర్, విజయప్రతాప్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, భూతరాజు ఆరోపించారు. కొందరు 70, 80 ఏళ్లు దాటినా వారి ఆధార్ కార్డుల్లో 40-45 ఏళ్లుగా ఉండడంతో పింఛన్లు అందుకోలేకపోతున్నారని, ఆ సమస్యను పరిష్కరించాలని కలెక్టర్ గౌతమిని లేపాక్షి జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి కోరారు.

ఇంజినీరింగ్ అసిస్టెంట్లను నియమించండి ..
జగనన్న కాలనీల్లో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు ముందుకు సాగాలంటే తగినంత మంది ఇంజినీరింగ్ అసిస్టెంట్లను నియమించాలని అమడగూరు, ఓడీసీ జెడ్పీటీసీ సభ్యులు కవిత, దామోదర్‌రెడ్డి కోరారు. ఉరవకొండలో 500 ఇళ్లు కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయని, వారికి ప్రత్యామ్నాయంగా మరోచోట పట్టాలివ్వాలని ఎంపీపీ చంద్రమ్మ విజ్ఞప్తి చేశారు.



సర్వసభ్య సమావేశానికి హాజరైన ఉమ్మడి అనంతపురం జిల్లా సభ్యులు

సమన్వయంతో పనిచేయాలి

అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసినప్పుడే మంచి ఫలితాలు వస్తాయని కలెక్టర్ గౌతమి పేర్కొన్నారు. గడువులోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఇల్లు మంజూరు చేస్తామని, దరఖాస్తు చేసుకున్న 90 రోజుల్లో పట్టా ఇస్తామని తెలిపారు. జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు ఇళ్ల నిర్మాణంపై దృష్టి సారించాలన్నారు. గడువులోగా కట్టుకోకుంటే ఇళ్లు రద్దు చేసి, మిగిలిపోయిన పేదలకు కేటాయిస్తామన్నారు.

వైద్యంపై అవగాహన కల్పించండి



ప్రభుత్వ ఆస్పత్రులు, పీహెచ్‌సీల్లో 'నాడు-నేడు' కింద చేపట్టిన పనులు, వచ్చిన మార్పులు, ఏ స్థాయి ఆస్పత్రుల్లో ఎవరెవరు ఉంటారు, ఎలాంటి సేవలందుతాయన్న అంశాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సూచించారు. వైద్య రంగానికి సీఎం జగన్ ఎనలేని ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు.

నాకు పెళ్లొద్దు..చదువుకుంటా

- ముఖ్యమంత్రి కార్యాలయానికి లేఖ పంపిన బాలిక
- ఆగమేఘాలపై స్పందించిన యంత్రాంగం
- బాల్యవివాహం నిలుపుదల.. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్

పుట్టపర్తి టౌన్: 'సార్...నాకు చదువుకోవాలని ఉంది. మా తల్లిదండ్రులు ఆధార్ కార్డులో వయస్సు మార్చి పెళ్లి చేయాలని చూస్తున్నారు. నాకు ఈ పెళ్లొద్దు...చదువుకునే అవకాశం కల్పించండి''అంటూ ఎన్పీకుంట మండలం తిమ్మమ్మ మర్రిమాను గ్రామానికి చెందిన 14 ఏళ్ల బాలిక సామాజిక మాధ్యమం ద్వారా సీఎం కార్యాలయానికి లేఖ పంపింది. దీంతో సీఎం కార్యాలయ అధికారులు వెంటనే స్పందించారు. విషయాన్ని ఎస్పీ మాధవరెడ్డికి తెలిపి బాలిక వివరాలు పంపారు. ఎస్పీ ఆదేశాలతో శనివారం గాండ్లపెంట ఎస్ఐ మల్లికార్జునరెడ్డి, ఎంపీడీఓ ఆదినారాయణ నేరుగా విద్యార్థి ఇంటికి వెళ్లారు. బాలిక తల్లిదండ్రులు, పెళ్లి కుమారుడి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. బాల్యవివాహాల వల్ల జరిగే అనర్థాలను వివరించారు. విద్యార్థి ఇష్టం మేరకు చదువుకునే విధంగా చర్యలు తీసుకున్నారు. దీంతో బాలిక సీఎం కార్యాలయానికి, స్థానిక అధికారులకు కృతజ్ఞతలు తెలిపింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ... బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమన్నారు. ఎవరైనా బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా శిక్షార్హులవుతారని హెచ్చరించారు. ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతున్నట్లయితే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు.

నవోదయ దరఖాస్తు గడువు పొడిగింపు

లేపాక్షి: జవహర్ నవోదయ విద్యాలయలో ఆరో తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తుకు ఈనెల 31వ తేదీ వరకూ గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ నాగరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుకు ఈ నెల 25వ తేదీనే గడువు ముగిసినప్పటికీ సాంకేతిక కారణాలతో ఇబ్బందులు పడిన వారికోసం గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

ప్రభుత్వ పాఠశాల చాలా బాగుంది

- అభినందించిన మలేషియా భక్తులు



మలేషియా భక్తులు అందజేసిన బెంచీలు, కుర్చీల్లో కూర్చున్న విద్యార్థులు

పుట్టపర్తి అర్బన్: 'గతంలో మేము చూసిన పాఠశాలకు..ఇప్పటి స్కూల్‌కు పొంతనేలేదు. కార్పొరేట్‌కు దీటుగా సౌకర్యాలు కల్పించారు. నిజంగా పాఠశాల చాలా బాగుంది. విద్యార్థులకు ప్రభుత్వమే యూనిఫాం, పుస్తకాలు, షూ తదితర వాటిని ఇవ్వడం అభినందనీయం' అని పలువురు మలేషియా భక్తులు అన్నారు. సత్యసాయి బాబా దర్శనార్థం పుట్టపర్తికి వచ్చే విదేశీ భక్తులు పుట్టపర్తి మండలంలోని పలు పాఠశాలలకు విద్యా సామగ్రి, తరగతి గదులకు కావాల్సిన పరికరాలను అందజేస్తుంటారు. ఈ క్రమంలోనే శనివారం పుట్టపర్తి మండలం నిడిమామిడి ఉన్నత పాఠశాలను పలువురు మలేషియన్లు సందర్శించారు. నూతనంగా నిర్మించిన అదనపు తరగతికి అవసరమైన 30 బెంచ్‌లు, 30 కుర్చీలను ప్రేమ సేవ ఆర్గనైజేషన్ ద్వారా అందజేశారు. దీంతో పాటు 50 జతల చెప్పులు, వాటర్ బాటిళ్లు, నోటు పుస్తకాలు, పెన్నులు, తదితర సామగ్రిని విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రభుత్వం అమలు చేస్తున్న 'నాడు- నేడు' మంచి పథకమన్నారు. పాఠశాలలను అభివృద్ధి చేసి సౌకర్యాలు కల్పించడం వల్ల నిరుపేద విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. అనంతరం వారు విద్యార్థులు, ఉపాధ్యాయులతో ముచ్చటించారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం నాగపద్మజ మలేషియన్లను సత్కరించారు.



బెంచీలు ఇచ్చిన గదిని ప్రారంభిస్తున్న భక్తులు

నేడు పుట్టపర్తికి గోవా గవర్నర్

పుట్టపర్తి అర్బన్: గోవా గవర్నర్ పీఎస్ శ్రీధరన్ పిళ్లై ఆదివారం పుట్టపర్తికి విచ్చేస్తున్నారు. ప్రశాంతి నిలయంలో ఆదివారం నుంచి ప్రారంభం కానున్న ఓనం వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొననున్నట్లు డీఆర్‌ఓ కొండయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రశాంతి నిలయం చేరుకోనున్న ఆయన.. ఓనం వేడుకల్లో పాల్గొని సాయంత్రం 5 గంటలకు చిక్‌బళ్లాపూర్ వెళ్తారని డీఆర్‌ఓ వెల్లడించారు.

భక్తులతో పోటెత్తిన కసాపురం



హనుమద్ వాహనంపై కొలువు దీరిన సీతారామలక్ష్మణులు



నెట్టికంటుడి ప్రాకారోత్సవం

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం శ్రావణ మాస రెండో శనివారం భక్తులతో పోటెత్తింది. శనివారం వేకువజామునే నెట్టికంటి ఆంజనేయస్వామికి మహాభిషేకాలు నిర్వహించారు. అనంతరం అర్చకులు స్వామివారిని స్వర్ణకవచ అలంకరణ, ప్రత్యేక పుష్పాలతో అందంగా తీర్చిదిద్దారు. ప్రత్యేక పూజల తర్వాత స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక నుంచి భారీగా తరలివచ్చిన భక్తులు ఆంజనేయస్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు బెల్దోణ సత్రంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం సీతారామలక్ష్మణులను హనుమద్ వాహనంపై కొలువుదీర్చి ఆలయ ఈఓ డి.వెంకటేశ్వరరెడ్డి, పాలకమండలి సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత స్వామివార్లను పల్లకీపై కొలువుదీర్చి ఆలయం చుట్టూ ప్రాకారోత్సవం నిర్వహించారు.

క్లుప్తంగా

చెక్‌పోస్ట్ వద్ద భారీ వర్షం



కొడికొండ చెక్‌పోస్ట్‌లో కురుస్తున్న వర్షం

చిలమత్తూరు: మండలంలోని 44వ జాతీయ రహదారిపై కొడికొండ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌లో శనివారం సాయంత్రం వర్షం దంచి కొట్టింది. 6 గంటలకు ప్రారంభమైన వర్షం గంట పాటు ఏకధాటిగా కురిసింది.

వ్యాయామ టీచర్లకూ స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

ప్రశాంతి నిలయం: వ్యాయామ విద్యకు పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం... ఎప్పటికప్పుడు వ్యాయామ ఉపాధ్యాయులతో చర్చించి తగు నిర్ణయాలు తీసుకునేందుకు సిద్ధమైంది. ఈ క్రమంలోనే మండల కాంప్లెక్స్ వారీగా ఉపాధ్యాయులకు సమావేశాలు నిర్వహించినట్లే...వ్యాయామ ఉపాధ్యాయులకూ నియోజకవర్గ స్థాయిలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులకు ఈ నెల 28 నుంచి ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో స్కూల్ కాంప్లెక్స్‌ల్లో సమావేశాలు నిర్వహించనున్నట్లు డీఈఓ మీనాక్షి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశాలకు ఆయా నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ యాజమాన్యాల కింద పనిచేసే పాఠశాలల పీఈటీలు, పీడీలు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. పుట్టపర్తి, కదిరి, హిందూపురం, మడకశిర, పెనుకొండ, ధర్మవరం నియోజకవర్గాలకు సంబంధించి ఆయా నియోజకవర్గ కేంద్రాల్లోని స్కూల్ కాంప్లెక్స్‌లో, రాప్తాడు మూడు మండలాలకు సంబంధించి చెన్నేకొత్తపల్లి మండల కాంప్లెక్స్‌లో సమావేశాలు ఏర్పాటు చేసినట్లు డీఈఓ వెల్లడించారు.

రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా

- జిల్లాలో 1,363 మంది గుర్తింపు
- కేటగిరీల వారీగా విభజన

జిల్లా ఏర్పడక ముందు రౌడీషీటర్ల సంఖ్య	1,344
ఇటీవల పెరిగిన రౌడీషీటర్లు	49 మంది
ప్రస్తుతం జిల్లాలోని రౌడీషీటర్లు	1,363 మంది



గాండ్లపెంట పీఎస్ పరిధిలో నేర ప్రవృత్తి కలిగిన వారి జాబితాను పరిశీలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి (ఫైల్)

పుట్టపర్తి టౌన్: జిల్లాలోని రౌడీ షీటర్లపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాలతో ఏఎస్పీ, డీఎస్పీ, సీఐలు, ఎస్‌ఐలు స్వయంగా రంగంలో దిగారు. నేరాల తీవ్రత, రౌడీషీటర్ పాల్పడుతున్న నేరాల సంఖ్య తదితర అంశాలను బట్టి విభాగాల వారీగా విభజించి నిఘా పెంచారు.

ఇద్దరిపై పీడీ యాక్ట్

జిల్లా వ్యాప్తంగా 1,363 మంది రౌడీషీటర్లను పోలీసులు గుర్తించారు. వీరిలో చాలామంది కొన్నేళ్లుగా నేరాలే వృత్తిగా స్వీకరించి జీవనం సాగిస్తున్న వారూ ఉన్నారు. వీరిలో ఇద్దరిపై పోలీసులు పీడీ యాక్ట్ ప్రయోగించారు. ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని డీఐజీ అమ్మిరెడ్డి ఆదేశాల మేరకు ఎస్పీ మాధవరెడ్డి సూచనలతో ముందస్తుగా రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచారు.

కేటగిరీల వారీగా విభజన

రౌడీషీటర్లలో వైట్‌కాలర్ నేరస్తులతో పాటు కిరాయి హత్యలు చేసే వారు, దోపిడీదారులు, తరచు తగాదాలు పడేవారు ఉన్నారు. వీరిపై ఉన్న కేసుల సంఖ్య, నేరాల తీవ్రతను బట్టి విభాగాల వారీగా విభజిస్తున్నారు. కీలక కేసుల్లో ఉన్న వ్యక్తులను 'ఏ' కేటగిరిలో, కేసులు సంఖ్య ఎక్కువగా ఉంటే 'బీ' కేటగిరిలో, వివాదాలు, గొడవలు, తరుచూ దుప్పటి పంచాయితీలు చేసేవారిని 'సీ' కేటగిరిలో ఉండేలా జాబితా సిద్ధం చేస్తున్నారు. ప్రమాదకరమైన రౌడీలను గుర్తించి వారి ప్రమేయమున్న కేసుల దర్యాప్తు వేగవంతం చేయడంతో పాటు ఆయా రౌడీలకు శిక్షపడితే జైళ్లకు తరలించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకు సంబంధించిన ప్రక్రియ దాదాపు పూర్తి కావస్తోంది. పదేళ్ల పాటు రౌడీషీట్ కలిగిన వారి ప్రస్తుత ప్రవృత్తి, స్థితిగతులు, వారి వ్యవహారాలు పరిశీలిస్తున్నారు. వారి సత్ప్రవర్తన ఆధారంగా ఎస్పీ తుది నిర్ణయం తీసుకోనున్నారు. హత్యలు, తరచూ గొడవలకు పాల్పడే వారు, దోపిడీలు చేస్తున్న వారిపై కూడా కొత్తగా రౌడీషీటర్లు తెరవాలని ఆదేశాలు జారీ చేశారు.

ప్రత్యేక కౌన్సెలింగ్‌లు

జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో రౌడీషీటర్లుగా నమోదైన వారి ఆయా పోలీస్ స్టేషన్లకు పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తున్నారు. సత్ప్రవర్తనతో మెలగాలని, గొడవలకు తెరదీసినా, సమాజానికి హాని కలిగించే పనులు చేసినా... పీడీ యాక్ట్ అమలుచేసి జిల్లా నుంచి బహిష్కరిస్తామని హెచ్చరిస్తున్నారు. ఎన్నికలు, ముఖ్యమైన సందర్భాలలో బైండోవర్ పనులూ వేగవంతం చేశారు.

రౌడీయిజాన్ని సహించం

రౌడీయిజాన్ని ఎంత మాత్రం సహించం. శాంతిభద్రతలకు విఘాతం కల్పించే ఎంతటి వారిపైనైనా రౌడీషీట్ తెరుస్తాం. విజువల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టిసారించాం. గంజాయి, బహిరంగ మద్యపానంపై ప్రత్యేక కేసులు నమోదు చేస్తున్నాం.

– మాధవరెడ్డి, ఎస్పీ

జీవితాంతం జగన్‌కు రుణపడి ఉంటా

- టీటీడీ బోర్డు సభ్యుడిగా భక్తులకు సేవలు అందిస్తా
- ఎమ్మెల్యే తిప్పేస్వామి



ఎమ్మెల్యే తిప్పేస్వామిని సన్మానించిన నాయకులు, కార్యకర్తలు

మడకశిరరూరల్: టీటీడీ పాలక మండలి సభ్యుడిగా మడకశిర ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామికి చోటు కల్పించడంపై వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. శనివారం తిమ్మేస్వామిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలతో కలసి ఎం.రంగాపురంలో వెలసిన రంగనాథస్వామి, ఆంజనేయస్వామి ఆలయాలను ఆయన సందర్శించి, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ప్రపంచ ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ పాలక మండలిలో సభ్యుడిగా అవకాశం కల్పించడంపై సీఎం వైఎస్ జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. ఇలాంటి గొప్ప గౌరవం దక్కుతుందని ఊహించలేదన్నారు. తన వంతుగా భక్తులకు శ్రీవారి సేవలు అందుబాటులోకి తీసుకువస్తానన్నారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో ఉచిత శిక్షణ

హిందూపురం: స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఉన్న స్కిల్ డెవలప్‌మెంట్‌సెంటర్‌లో ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ ఆధ్వర్యంలో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి షేక్ అబ్దుల్ ఖయ్యూం శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి ఉన్న నిరుద్యోగ యువతీయువకులు నేరుగా ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో పేర్లు నమోదు చేసుకోవాలి. పూర్తి వివరాలకు 94920 51475, 9959419089లో సంప్రదించవచ్చు.

నేటి నుంచి గ్రామీణ బాలికల అథ్లెటిక్స్ మీట్

- 38 ప్రాంతాల నుంచి తరలివచ్చిన 350 మంది క్రీడాకారులు
- మొత్తం ఆరు విభాగాల్లో క్రీడాపోటీలు

అనంతపురం: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గత నెల 17 నుంచి ఈ నెల 18వ తేదీ వరకూ ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏరియా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చాటిన వారికి ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకూ కేంద్రస్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. పోటీల్లో పాల్గొనేందుకు ఆర్డీటీ పరిధిలోని బుక్కరాయసముద్రం, బత్తలపల్లి, కదిరి, కళ్యాణదుర్గం, ఉరవకొండ, మడకశిర, శ్రీశైలం, ఆదోని ప్రాంతాల నుంచి అండర్–15 విభాగానికి చెందిన 350 మందికి పైగా బాలికలు తరలివచ్చారు. 100 మీటర్లు, 200మీ, 400మీ, 4 × 100మీటర్ల రిలే పరుగు, లాంగ్‌జంప్, షాట్‌పుట్‌లతో సహా ఆరు క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు.

గ్రంథాలయం తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఉమాదేవి

ధర్మవరం రూరల్: స్థానిక గ్రంథాలయాన్ని శనివారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమాదేవి ఆకస్మిక తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. పాఠకుల సంఖ్య, సభ్యత్వ నమోదుపై గ్రంథాలయ అధికారి ఏంజిలిన్ సౌభాగ్యవతితో ఆరా తీశారు. గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని, పాఠకులకు అవసరమైన పత్రికలు, పుస్తకాలతో పాటు, ఉద్యోగార్థుల పోటీ పరీక్షలకు అనువైన పుస్తకాలను అందుబాటులో ఉంచాలని సూచించారు.

వంద శాతం జీఈఆర్ సాధనే లక్ష్యం

ప్రశాంతి నిలయం: ప్రతి మండలంలోనూ ప్రతి కళాశాలలో వంద శాతం విద్యార్థుల స్థూల నమోదు నిష్పత్తి (గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో – జీఈఆర్) సాధించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓలకు ఇంటర్మీడియట్ బోర్డు డీవైఈఓ రఘునాథరెడ్డి సూచించారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. పదో తరగతి పాస్ అయిన ప్రతి విద్యార్థి తప్పనిసరిగా ఇంటర్మీడియట్‌లో చేరింది, లేనిది ఆరా తీయాలన్నారు. ఇంటర్‌లో చేరినట్లుగా తెలిస్తే వివరాలు సేకరించి పక్కాగా నమోదు చేయాలని సూచించారు. ఈ ప్రక్రియను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని కోరారు.

బాలుడిపై వీధికుక్కల దాడి

హిందూపురం అర్బన్: స్థానిక ఆటోనగర్‌లో వీధి కుక్కల దాడిలో ఓ బాలుడు గాయపడ్డాడు. శనివారం ఉదయం ఏడేళ్ల వయసున్న హబీబ్ తన ఇంటి వద్ద ఆడుకుంటున్న సమయంలో అటుగా వచ్చిన వీధి కుక్కలు ఒక్కసారిగా చుట్టుముట్టాయి. బాలుడి కేకలు విన్న కుటుంబసభ్యులు, చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని కుక్కలను తరిమేశారు. అప్పటికే తీవ్రంగా గాయపడిన బాలుడిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు.

సినిమా సందడి



లెక్చరర్లతో ఆర్.నారాయణ మూర్తి

అనంతపురం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను సినీనటుడు, నిర్మాత ఆర్.నారాయణ ర్తి బృందం శనివారం సందర్శించింది. యూనివర్సిటీ పేరుతో తీసిన చిత్రం ప్రమోషన్ ప్రక్రియలో భాగంగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను సందర్శించినట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి, అధ్యాపకులతో కాసేపు సరదాగా గడిపారు.

పోక్సో కేసు నమోదు

బొమ్మనహాళ్: కణేకల్లు మండలం ఉడేగోళం గ్రామానికి చెందిన యువకుడిపై లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ చట్టం (పోక్సో) కింద కేసు నమోదైంది. ఈ మేరకు ఎస్ఐ శివ శనివారం వెల్లడించారు. బొమ్మనహాళ్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన 15 ఏళ్ల బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మించి తనతోపాటు ఉడేగోళానికి చెందిన మహేష్ తీసుకెళ్లాడు. దీనిపై బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు మహేష్‌పై బాలిక కిడ్నాపింగ్‌తో పాటు పోక్సో కింద కేసు నమోదు చేసి, అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'సెక్టోరియల్' ఇన్‌చార్జ్‌ల నియామకం

రాప్తాడురూరల్: సమగ్ర శిక్ష కార్యాలయంలోని వివిధ సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారుల పోస్టులకు ఇన్‌చార్జ్‌లను నియమిస్తూ కలెక్టర్ గౌతమి ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్‌చార్జ్ ఏఎంఓగా చంద్రశేఖర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ జీసీడీఓగా మహేశ్వరి, ఇన్‌చార్జ్ అసిస్టెంట్ అలెస్కోగా కె.గోవిందరెడ్డి, ఇన్‌చార్జ్ ఏఎస్‌ఓగా కె.రామ్‌ప్రసాద్‌రెడ్డిని నియమించారు. వీరంతా విధుల్లో చేరారు. గతంలో ఇక్కడ ఏఎంఓగా పని చేస్తున్న హరికృష్ణ, జీసీడీఓ వాణీదేవి ఇద్దరూ ఎంఈఓ–2గా వెళ్లారు. గతంలోనే అసిస్టెంట్ అలెస్కో, ఏఎస్‌ఓ పోస్టులు ఖాళీగా ఉండేవి. మొత్తం నాలుగు పోస్టులను భర్తీ చేయడంతో ఆయా విభాగాల్లో పనులు వేగవంతం కానున్నాయి.

ముమ్మరంగా గండి పూడ్చివేత పనులు



గండి పూడ్చివేత పనులు చేస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: బళ్లారి జిల్లా కొలగల్లు గ్రామం వద్ద హెచ్చెల్సీ 78వ కిలోమీటర్ వద్ద శుక్రవారం రాత్రి పడిన గండి పూడ్చివేత పనులు వేగంగా సాగుతున్నాయి. కాలువ కుడిగట్టుకు గండిపడి సుమారు 15 మీటర్ల మేర తెగిపోయింది. ఆ సమయంలో కాలువలో 2,200 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. నీటి ఉధృతకు కాలువ గట్టు మరింత ఎక్కువగా కోతకు గురైంది. డ్యామ్ నుంచి కాలువకు నీరు పూర్తిగా బంద్ చేశారు. సమాచారం అందుకున్న తుంగభద్ర డ్యామ్ ఎస్ఈ శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. గండిని పూడ్చి వేసేందుకు భారీ యంత్రాలను రంగంలో దించారు. మరో రెండు రోజుల పాటు గండి పూడ్చి వేత పనులు సాగుతాయని ఈ సందర్భంగా తుంగభద్ర బోర్డు అధికారులు తెలిపారు.

నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించండి

- ఆర్టీసీ జోన్–4 ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు



కదిరి అర్బన్: విధుల నిర్వహణలో పక్షపాతం ఉండరాదని ఆర్టీసీ ఉద్యోగులకు ఆ సంస్థ జోన్ –4 ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు సూచించారు. శనివారం ఆయన కదిరి డిపోను ఆకస్మిక తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. బస్సు ఇంజన్ల జీవితకాలాన్ని పెంచుతున్న అసిస్టెంట్ ఇంజనీర్ రామకృష్ణ కృషిని ప్రత్యేకంగా అభినందించారు. డ్యూటీ చార్టు వద్ద యూనియన్ ఒత్తిళ్లకు లోబడి పనిచేస్తే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. కదిరి – పుట్టపర్తి మధ్య ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులు నడిపేందుకు చర్యలు తీసుకోవాలని డిపో మేనేజర్ మైనుద్దీన్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది నష్టాల శాతం తగ్గడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇంకా మెరుగైన రవాణా సౌకర్యాలను ప్రయాణికులకు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. తెలుగు భాషా వారోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 23 నుంచి 29వ తేదీ వరకూ తెలుగులోనే వ్యవహారాలు నిర్వహించేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కడప జోన్ డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ మోహన్ కుమార్, అసిస్టెంట్ మేనేజర్లు హరిత, హరిమోహన్, సూపర్‌వైజర్లు నబీరసూల్, నాగప్ప, యాకూబ్‌ఖాన్, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు మృతదేహం లభ్యం

ఉరవకొండ: మండలంలోని రాయంపల్లి వద్ద శుక్రవారం మధ్యాహ్నం హెచ్చెల్సీలో గల్లంతైన రైతు మల్లికార్జున మృతదేహమై తేలాడు. ఆయన మృతదేహాన్ని శనివారం నింబగల్లు సమీపంలోని హెడ్ రెగ్యులేటరీ వద్ద బంధువులు గుర్తించి, వెలికి తీశారు. పొలంలోకి వెళ్లే క్రమంలో కాలువను దాటుకుంటుండగా గల్లంతయ్యాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

9 మంది బీటర్ల అరెస్ట్

- రూ. 3,30,950, బాల్‌పెన్నులు, మట్కాపట్టీలు స్వాధీనం

తాడిపత్రి: పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో మట్కా రాస్తున్న 9 మంది బీటర్లను అరెస్ట్ చేశారు. ఈ మేరకు సీఐ హమీద్ ఖాన్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పట్టుబడిన వారిలో యల్లనూరు మండలం కోడుమూర్తి గ్రామానికి చెందిన గొంది మల్లికార్జున, తాడిపత్రికి చెందిన కొలిమి ప్రతాప్, హరిజన వాడకు చెందిన కొమ్ము రాజకుళ్లాయప్ప, శివాలయం వీధికి చెందిన షేక్ చాంద్‌బాషా, షేక్ మహబూబ్ బాషా, గాంధీకట్ట వద్ద నివాసముంటున్న ఉదయగిరి మాబున్నీ, పుట్లూరు నివాసి నల్లఓబన్న గారి శివప్రసాద్, తిమ్మంపల్లి గ్రామానికి చెందిన వెన్నపూస చంద్రశేఖర్‌రెడ్డి, కోడవండ్లపల్లి గ్రామం ఉసోళ్ల మహేష్ ఉన్నారు. వీరి నుంచి రూ. 3,30,950 నగదుతో పాటు బాల్‌పెన్నులు, 18 మట్కా పట్టీలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నేమకల్లుకు పోటెత్తిన భక్తులు



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

బొమ్మనహాళ్: శ్రావణమాసం రెండో శనివారాన్ని పురస్కరించుకుని నేమకల్లు ఆంజనేయస్వామిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. వేలాదిగా భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి. స్వామివారి మూలవిరాట్‌కు ఆలయ ప్రధాన అర్చకులు అనిల్ కుమార్‌స్వామి ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. పట్టువస్త్రాలు, విశేష పుష్పాలు, వెండి కవచంతో శోభాయమానంగా అలకరించారు. ఆకుపూజలు, కుంకుమార్చనలతో భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు సాయి బాలాజీ స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీ యాజమాన్యం ఆధ్వర్యంలో భోజన సౌకర్యం కల్పించారు. కార్యక్రమాలను ఆలయ పాలక మండలి సభ్యులతో పాటు దేవదాయ శాఖ ఈఓ నరసింహారెడ్డి పర్యవేక్షించారు.



ఆలయం వద్ద భక్తుల సందడి

భక్త జన సందోహం

పావగడ: శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని రెండో శనివారం పావగడలోని శనీశ్వరాలయానికి భక్తులు పోటెత్తారు. వేలాదిగా భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు జనసందోహమయ్యాయి. శుక్రవారం రాత్రే ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. శనివారం తెల్లవారు జాము 2 గంటలకు దైవదర్శనానికి బారులు తీరారు. తెల్లవారు జాము 4 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విశేష అభిషేకాలు, అర్చనలు కొనసాగాయి. ప్రత్యేక భవనంలో నవగ్రహ పూజలు పెద్ద ఎత్తున జరిగాయి. ఆలయ సమీపంలోని అగ్నిగుండంలోకి నల్ల వత్తులు, టెంకాయలు వేసి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు ఎలాంటి అసౌకర్యాలకు గురికాకుండా ఆలయ సమితి అధ్యక్షుడు ఆనందరావు, పదాధికారులు, వలంటీర్లు విశిష్ట సేవలు అందించారు.



అగ్నిగుండంలోకి వత్తులు వేస్తున్న దృశ్యం



స్వామి దర్శనం కోసం బారులుదీరిన భక్తులు